26CTR1:26CTR1.qxd 10/25/2026 11:16 PM Page 1




# తిరుపతి - చిత్తూరు

30 ఏళ్ల ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026

తెలుగు జాతీయ దినపత్రిక **వార్త**


## తిరుమలలో జోరువాన



తిరుమల, అక్టోబర్ 25ప్రభాతవార్తప్రతినిధి: గత మూడురోజులుగా తిరుమలకొండపై వానలు దంచికొడుతున్నాయి. ఆదివారం ఉదయం నుండి కొండపై కొంతసమయం తెరపిచ్చినా ఆ తరువాత 11గంటల నుండి మళ్ళీ వరుణదేవుడు చల్లనిచూపుతో తిరుమలలో జోరువాన కురిసింది. భారీ వర్షాలు కురుస్తుండటంతో ఆలయం పరిసరాలు, కొండపై చాలాప్రాంతాలు వర్షపునీటితో సందడిగా మారింది. ఉదయం కురిసిన జోరువానతో ఆలయంలోపలకు వెళ్ళే భక్తులతో బాటు దర్శనానంతరం ఆలయం వెలుపల వచ్చిన భక్తులు తడిసి ముద్దయ్యారు.

## శ్రీచెంగాళమ్మ దేవస్థానంలో చండీయాగం

సూళ్లూరుపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళ మాత పరమేశ్వరి దేవస్థానంలో పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం మహా చండీయాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా గోమాతకు పూజలు చేసిన అనంతరం దేవస్థాన ప్రాంగణంలోని యాగ మండపంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం పూర్ణాహుతితో చండీయాగం ముగిసింది. చండీయాగానికి నెల్లూరుకు చెందిన వేణుంబాక రమణారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ బి. ప్రసన్న లక్ష్మి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

# కురుస్తున్న వర్షాలు.. విస్తారంగా నార్లు

## తూర్పు మండలాల్లో వ్యవసాయ పనుల్లో అన్నదాతలు నిమగ్నం

**తిరుపతి జిల్లా తూర్పు నియోజకవర్గాలైన శ్రీకాళహస్తి,సత్యవేడులలో ఈ ఏడాది వరుణుడు కరునిస్తాడో లేదో అని దిగాలు చెందిన రైతుకు తుఫాను,అల్పపీడనాలతో ఊపిరి పీల్చుకున్నారు. గత వారం రోజులుగా వాతావరణం చల్లబడటంతో పాటు వర్షాలు కురుస్తుండటంతో నార్లు పోసుకుంటున్నారు. రాజకీయనాయకులు ఎన్నికల్లో నిమగ్నం కాగా రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వ్యవసాయానికి సెలవు అనుకుంటున్న తరుణంలో వరుణుడు బంగాళాఖాతంలో అల్పపీడనాలతో కరుణించాడు.దాంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.**



బుచ్చినాయుడుకండ్రిగ సమీపంలో యంత్రాలతో నార్లు పోసుకున్న దృశ్యం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 25 ప్రభాతవార్త

'ఉత్తర చూసి ఎత్తర గంప అనేది నానుడి'. ముందస్తు ఖరీఫ్‌సీజన్‌లో పంటలు వేయటానికి ఉత్తర గాలివాటం చూసి పంటలకు సిద్ధమయ్యేవారు.అయితే నేడు రైతులు ఈ విధానాలకు స్వస్తి చెప్పి సీజన్‌ను మార్చుకున్నారు.వ్యవసాయం బంగాళాఖాతంలో అల్పపీడనాల మీద ఆధారపడింది. శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యవసాయానికి పెట్టింది పేరు ఈ నియోజకవర్గంలో చెరువులు,బోర్లు, తెలుగుగంగ నీటితో రైతులు వ్యవసాయం సాగిస్తున్నారు. శ్రీకాళహస్తి వ్యవసాయ డివిజన్‌లో ఏర్పేడు,శ్రీకాళహస్తి,తొట్టంబేడు,కెవిబిపురం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాలున్నాయి. ఇక్కడ రైతులు వరి, వేరుశెనగ,సజ్జ పంటలను విస్తారంగా వేస్తారు.ఈ ప్రాంతాల్లో రబీ సీజన్‌లో ముమ్మరంగా వరి పండిస్తారు. వ్యవసాయశాఖాధికారులు అందించిన సమాచారం మేరకు 32వేల హెక్టార్లలో వరి పండించటం ఆనవాయితి. ఇక్కడ బిపిటి,బుడ్డొడ్లు విస్తారంగా పండిస్తారు.ఈ ఏడాది బియ్యం ధరలకు రెక్కలు రాగా రైతుల్లో ఆశలు చిగురించాయి.

### తగ్గని ఎండలు . . . జోరుగా వ్యవసాయం:

తిరుపతిజిల్లా తూర్పు నియోజకవర్గాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సాధారణంగా ఎండలు మార్చి నుంచి మే వరకు ఉండేవి ఎల్‌నోని ప్రభావంతో ఈ ఏడాది ఇప్పటి వరకు ఎండలు తగ్గలేదు.అయితే బోర్లు,భూగర్భజలాలు పుష్కలంగా ఉండటం తెలుగుగంగ ఓ వరంగా మారటంతో రైతులు ధైర్యంగా నార్లు పోసుకుంటున్నారు.ఈ ఏడాది రైతులు ప్రభుత్వం సేకరించని 1010 రకం వరిని ఎంపిక చేసుకున్నారు. ప్రభుత్వం సేకరించకున్నా ఈ రకం దిగుబడి ఎకరాకు 40 నుంచి 45 బస్తాలు దిగుబడి వస్తుందని ఒకనెల ముందుగానే పంట చేతికొస్తే ధర బాగా పలుకుతుందనే భావంతో పరుగులు తీస్తున్నారు. ఇక వేరుశెనగ ట్యాగ్ 24 రకాలను ఎంపిక చేసుకున్నారు. పొట్టి రకాల్లో దిగుబడి అధికంగా ఉంటుందని ఎన్నుకున్నారు.

### రైతుల్లో ఉత్సాహం: ఎడి రమేష్‌రెడ్డి

శ్రీకాళహస్తి వ్యవసాయ డివిజన్‌లో ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో క్రాప్ హాలిడే అనుకుంటున్న తరుణంలో వరుణ దేవుని కరుణతో రైతుల్లో ఉత్సాహం చోటు చేసుకుందని నార్లు పోసుకొని సిద్ధం చేసుకుంటున్నారని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రమేష్‌రెడ్డి ప్రభాతవార్తకు వివరించారు.రైతులకు అవసరమైన మేరకు యూరియాను సరఫరా చేయుటకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు.ఒక ఎకరాకు మూడు బస్తాల చొప్పున అందించుటకు సిద్ధం చేసామన్నారు. ఇప్పటికే రైతులకు కార్డులు జారి చేసామని అయితే ఈ ఏడాది అక్రమాలను అరికట్టుటకు ప్రభుత్వం కొత్తయాప్‌ను ఏర్పాటు చేసిందన్నారు. కార్డును కూడా తీసుకెళ్ళాలని సూచించారు.డీలర్ల ద్వారానే కాకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా కూడా అందించుటకు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలని రమేష్‌రెడ్డి సూచించారు.

## తిరుపతి ఓటర్ల చేతుల్లో

# కీలక మేయర్ అభ్యర్థుల తలరాత?

### -సామాజిక సమీకరణాలా ?రాజకీయ బలమా?

### బరిలో 10 మంది అభ్యర్థులు







ప్రభాతవార్త–తిరుపతి:

ఎంతో ప్రతిష్టాత్మకంగా మారిన తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ పదవికి మొత్తం 10 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. నామినేషన్ల ప్రక్రియ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలతో అధికారిక నివేదికలో ఆసక్తికరమైన సామాజిక, రాజకీయ సమీకరణాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మన్నెం శ్రీనివాస ప్రసాద్ (జేబీ శ్రీనివాస్), మరోవైపు వైసిపి అభ్యర్థి వై. వాసుదేవ యాదవ్‌తో బాటు ఇతర పార్టీల, స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. అధికారిక జాబితాలో పేర్కొన్న సామాజిక వర్గాల ప్రకారం, టిడిపి అభ్యర్థితో కలిపి మొత్తం ఆరుగురు అభ్యర్థులు ఓసి సామాజిక వర్గానికి చెందినవారు. ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి నాగేశ్వర నెరెగుట్ట, బీఎస్పీ అభ్యర్థి జి. శశికుమార్, కాంగ్రెస్ అభ్యర్థి సి. శివశంకర్ ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు. వైసిపి అభ్యర్థి వై. వాసుదేవ యాదవ్ ఒక్కరే బిసి –డి యాదవ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిగా ఉన్నారు. బిసివై పార్టీ అభ్యర్థి డి. లత కూడా ఓసి సామాజిక వర్గానికి చెందినవారిగా అధికారిక జాబితాలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సామాజిక వర్గాల సమీకరణాలు ఎన్నికల ఫలితాలపై ఏ మేరకు ప్రభావం చూపుతాయన్నది ఆసక్తికరంగా మారింది. పార్టీ అభిమానం, స్థానిక సమస్యలు, అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు, ప్రజల్లో ఉన్న ఆదరణ, కూటమి రాజకీయాలు వంటి అనేక అంశాలు ఓటింగ్‌ను ప్రభావితం చేయవచ్చు. టీడీపీ అభ్యర్థికి పార్టీ సంస్థాగత బలం, కూటమి మద్దతు, ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయం అనుకూలంగా మారే అవకాశం ఉంది. అయితే ఆ ప్రయోజనాలు ఓట్లుగా ఎంతవరకు మారతాయనేది స్థానిక నాయకత్వం, ప్రచారం, వార్డుల వారీగా ఉన్న రాజకీయ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. వైసిపి అభ్యర్థి వై. వాసుదేవ యాదవ్‌కు బిసి యాదవ సామాజిక వర్గం నుండి మద్దతు లభిస్తుందా? ఇతర సామాజిక వర్గాల ఓటర్లను కూడా ఆకర్షించగలరా? అనేది కీలకం. అదే సమయంలో టిడిపికి వ్యతిరేకంగా ఉన్న ఓట్లు ఏకీకృతమవుతాయా, ఇతర పార్టీల, స్వతంత్ర అభ్యర్థుల మధ్య చీలిపోతాయా అన్నది కూడా ఫలితాన్ని ప్రభావితం చేయగల అంశం. ఆమ్ ఆద్మీ పార్టీ, బీఎస్పీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారే కావడం మరో చర్చనీయాంశం. అయితే, ఈ ముగ్గురి అభ్యర్థిత్వం వల్ల ఎవరికి నష్టం జరుగుతుందో ముందుగానే నిర్ణయించలేం. వారి పార్టీలకు ఉన్న స్థానిక బలం, అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు, ఓటర్లలో వారి ప్రభావం ఆధారంగానే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుంది. ఈ ఎన్నికల్లో సామాజిక వర్గాల లెక్కలతో బాటు ప్రస్తుత రాజకీయ వాతావరణం కూడా కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న సానుకూలత గానీ అసంతృప్తి, గత పాలనపై అభిప్రాయాలు, నగరంలో అభివృద్ధి పనులు, తాగునీరు, పారిశుద్ధం, రహదారులు, ట్రాఫిక్ వంటి స్థానిక సమస్యలు ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేయవచ్చు. మరో ముఖ్యమైన అంశం అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ఠ. పార్టీ గుర్తు ఒక మేరకు ఓట్లు తెచ్చిపెట్టినా, స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండటం, సమస్యల పరిష్కారంలో చొరవ చూపడం, ప్రజలతో ఉన్న సంబంధాలు కూడా అభ్యర్థి విజయావకాశాలను నిర్ణయిస్తాయి. ఓసి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు ఎక్కువగా ఉండటం వల్ల ఆ వర్గం ఓట్లు ఒకే అభ్యర్థికి పడతాయని చెప్పలేం. కుల సమీకరణాల కంటే రాజకీయ విధేయత, అభ్యర్థులపై విశ్వాసం, స్థానిక పరిస్థితులు కొన్నిసార్లు ఎక్కువ ప్రభావం చూపవచ్చు. మొత్తం పది మంది అభ్యర్థులు బరిలో ఉన్న నేపథ్యంలో ఓట్ల చీలిక ఎవరికి అనుకూలంగా మారుతుందో ఇప్పుడే చెప్పడం కష్టం. స్వతంత్ర అభ్యర్థులు, చిన్న పార్టీల అభ్యర్థులు సాధించే ఓట్లు ప్రధాన పార్టీల అభ్యర్థుల ఆధిక్యాన్ని ప్రభావితం చేయవచ్చు. మేయర్ పీఠాన్ని నిర్ణయించేది కుల సమీకరణాలు మాత్రమే కాదు.. రాజకీయ బలం, అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం, ప్రజా సమస్యలు, ఓటర్ల ఆలోచన కూడా!

## కార్పొరేటర్లకు తప్పని ఎన్నికలు

### 66 డివిజన్లలో టిడిపి 39, జనసేన 22 డివిజన్లలో, బీజేపీ 5, వైసిపి 63 డివిజన్లలో పోటీ

ప్రభాతవార్త–తిరుపతి:

తిరుపతి నగరపాలకసంస్థ కౌన్సిల్ ఎన్నికల్లో 66 డివిజన్లకుగాను ప్రధాన పార్టీలు టిడిపి, జనసేన, బిజెపితోబాటు వైసిపి,సిపిఐ,సిపిఎం, స్వతంత్రులు పోటీలో నిలిచారు. ఆదివారం రాత్రి నామినేషన్ల ఉపసంహరణ తరువాత కార్పొరేటర్ల బరిలో 214మంది నిలిచారు. వీరిలో టిడిపి అభ్యర్థులు 39 డివిజన్లలో పోటీలో ఉండగా, వైసిపి 63 డివిజన్లలో పోటీలో ఉన్నారు. మిగిలిన చోట్ల కూటమి పార్టీల ఒప్పందంలో భాగంగా జనసేన 22, బిజెపి అభ్యర్థులు 5 కార్పొరేటర్ల బరిలో ఉన్నారు. ఈ ఎన్నికలు నవంబర్ 1వతేదీ ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు జరగనున్నాయి.తిరుపతి కార్పొరేషన్‌కు 66డివిజన్లకు తొలుత 543 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆదివారం రాత్రికి చివరగా జాబితాలో 66డివిజన్లకుగాను 214 మంది నామినేషన్లు ఒకే అయ్యాయి. పోటీలో ఉన్నారు.

### అప్పీళ్ళలో 2 నామినేషన్లను

## తిరస్కరించిన కలెక్టర్



చిత్తూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త:

జడ్పీటిసీ ఎన్నికల నామినేషన్ల పరిశీలనలో తిరస్కరణకు గురైన నామినేషన్లపై అభ్యర్థులకు అప్పీళ్ళు చేసుకునే కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ రెండు అప్పీళ్ళను తిరస్కరించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడుల ఆధ్వర్యంలో జడ్పీ కార్యాలయంలో ఆదివారం తిరస్కరణకు గురైన నామినేషన్లపై అభ్యర్థులు అప్పీలు చేసుకున్నారు. యాదమరి జడ్పీటిసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కె.పుష్పావతి తన నామినేషన్ నామినేషన్ల పరిశీలన కార్యక్రమంలో తిరస్కరణకు గురైందని, తాను దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను పరిశీలించి తనకు ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు అప్పీలు చేసుకుంది. పరిశీలించిన కలెక్టర్ జిల్లాలోని గ్రామీణ ప్రాంత ఓటర్ల జాబితాలో కె.పుష్పావతి ఓటరుగా ఎక్కడా నమోదు కాకపోవడంతో ఆమె నామినేషన్‌ను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే పులిచెర్ల జడ్పీటిసీ అభ్యర్థిగా పోటీ చేయడానికి నామినేషన్ దాఖలు చేసిన అద్దంకి మునిరాజ సైతం నామినేషన్ల పరిశీలనలో తన నామినేషన్ తిరస్కరణకు గురైందని పరిశీలించి తాను ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని అప్పీలు చేశారు. నామినేషన్ పత్రాలను సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్ అభ్యర్థి అద్దంకి మునిరాజ జడ్పీటిసీ నామినేషన్ ధృవపత్రంను అసంపూర్తిగా నింపడం, సాక్షి సంతకం, నామినేషన్ దాఖలు చేసిన వారి సంతకం, ప్రతిపాదకుడి సంతకం, స్థిర చరాస్తుల వివరాల నమోదు చేయకపోవడంతో అద్దంకి మునిరాజ నామినేషన్ తిరస్కరణకు గురైందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

## గణపయ్యకు ఘనంగా అన్నాభిషేకం

### -ఆకట్టుకున్న ప్రత్యేక అలంకరణ





కాణిపాకం, అక్టోబర్ 25 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారికి అన్నాభిషేకంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో అల్పిసి నెల పౌర్ణమి సం దర్భంగా స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఆదివారం స్వామివారికి ఈ కార్యక్రమంను నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకంకు చెందిన దివంగత సల్లా సుబ్బరాయలుశెట్టి కుమారులు సల్లా వాసు, సల్లా హరిలు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు వారు ఉదయం మంగళవాయిద్యాల నడుమ వరుస ఉభయం తీసుకు రాగా ఆలయంలో అర్చక స్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా పంచా మృతాభిషేకం నిర్వహించారు.అనంతరం స్వామివారిని అన్నంతో శోభాయమానంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈసందర్భంగా వివిధ రకాల పిండివంటలు, పండ్లును స్వామివారికి నైవేధ్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. అన్నాభిషేకం సందర భంగా ఉభయదారులచే ఆలయంలో చేపట్టిన ప్రత్యేక అలంకరణ ఎంతో అకట్టుకుంది. ఈమేరకు ప్రధాన ఆలయంతో పాటు బంగారుధ్వజ స్థంభం, అన్వేటి మండపం,సుపథమండపంలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన తీరు ఎంతో ఆకట్టుకుంది. ఇదిలా వుండగా స్వామివారికి నిర్వహించిన అన్నంను సాయంత్రం తొలగించి ఆలయ పవిత్ర పుష్కరిణిలో నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి,శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవి,ఉత్సవ ఉభయదారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## మేమూ పోటీలో ఉంటాం !

### స్థానిక పరిషత్ ఎన్నికల్లో రెబల్స్‌లా

### కోడూరులో డమ్మీ అభ్యర్థులు

రైల్వే కోడూరు, అక్టోబర్, 25 ప్రభాతవార్త:





రాజకీయపార్టీలు పేర్కొన్న అభ్యర్థులు తప్ప మరెవరూ స్థానిక పరిషత్ ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేయరాదని, సమర్పించినా ఉపసంహరించుకోవాలని పార్టీ అధిష్టానాలు ఆదేశించినా ఇవేమీ రైల్వే కోడూరు నియోజకవర్గంలో నేతలకు చెవికెక్కలేదు. పైగా ఏకంగా స్థానిక ఎంపిటిసి ఎన్నికల్లో డమ్మీ అభ్యర్థులు తమ నామినేషన్లను ఆదివారం కూడా యధావిధిగా ఉంచడంతో ఇప్పుడు రసవత్తర పోటీగా మారింది.తమతమ నామినేషన్లను తంటాలు పడి దాఖలు చేసినా చివరకు పార్టీ నేతలు చెప్పినా వినిపించుకోకపోవడంతో రైల్వేకోడూరులో పోటీ తప్పలేదు. పైగా డమ్మీ అభ్యర్థులు ప్రధాన పార్టీల అభ్యర్థులకు తలనొప్పి వ్యవహారంగా మారారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం ఆదివారం సాయంత్రానికి టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానంద రెడ్డి దృష్టికి రావడంతో వారిని ఛీ కొట్టారు. ప్రస్తుతం జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో పలువురు అభ్యర్థులు వేసిన వందల సంఖ్యల నామినేషన్లు చూస్తుంటే అధిక శాతం ప్రధాన పార్టీల నేతల నుండి అందినకాడికి వసూలుచేసుకోవడమే దీనివెనుక ఉన్న మతలబుఅన్నట్లు వ్యాఖ్యలు గుప్పుమంటున్నాయి. ఈ పరిస్థితి ఓబులవారిపల్లి మండలంలో ఎం. పి. టి. సి. 1,2స్థానాలలో టిడిపి ఇన్‌చార్జికి ఎదురు కావడం మరీ చర్చనీయాంశంగా మారింది. మాజీ సర్పంచ్ గంగన్న గారి సుబ్రహ్మణ్యం రెడ్డి, పంచాయతీ లోని మాజీ సర్పంచ్ ద్వారా టిడిపి ఇన్‌చార్జి వద్దకు వెళ్లి నట్లు తెలిసింది. మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి జోక్యం చేసుకొని డబ్బులు డిమాండ్ చేశారనేది ఆరోపణలు.

# ఎస్వీయూలో అధికారం ఎవరి చేతిలో?

## పాలక మండలి లేదు.. కీలక పోస్టులకు దిక్కులేదు!



తిరుపతి విద్య, అక్టోబర్ 25 ప్రభాతవార్త

వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తు, పరిశోధకుల ప్రగతి, అనుబంధ కళాశాలల పర్యవేక్షణతో ముడిపడిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో కీలక పదవుల ఖాళీలు ఇప్పుడు పాలనపైనే ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. పాలక మండలి గడువు ముగిసి నెలలు గడుస్తున్నా కొత్త మండలి నియామకం లేకపోవడం.. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుల నియామకం ఏడాదిగా పెండింగ్‌లో ఉండటం.. మరోవైపు కీలక విద్యా పరిపాలనా పోస్టులు ఖాళీగా కొనసాగడం వర్సిటీ వ్యవస్థలో సమన్వయంపై సందేహాలు కలిగిస్తోంది. విద్యా సంస్థను ముందుకు నడిపించాల్సిన కీలక వ్యవస్థల్లోనే ఖాళీలు ఉంటే నిర్ణయాలు ఎలా సాగుతున్నాయన్న ప్రశ్న ఇప్పుడు తెరపైకి వస్తోంది.విశ్వవిద్యాలయంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుల నియామకం జరగకపోవడం వల్ల బోధన, పరిశోధన, ఫెలోషిప్‌లకు సంబంధించిన అంశాలపై ప్రభావం పడుతోందని బి సి విద్యార్థి సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు కళ్లుపల్లి తిరుమలేష్ ,బి భాస్కర్ యాదవ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరోపించారు. పాలక మండలి గడువు ముగిసిన తర్వాత కొత్త మండలిని ఏర్పాటు చేయడంలో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి కీలకమైన నిర్ణయాలు తీసుకునే వ్యవస్థలు సక్రమంగా పనిచేసేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.అనుబంధ కళాశాలల పర్యవేక్షణకు దిక్కేది? సీడీసీ డీన్ పోస్టు ఖాళీగా ఉండటంతో విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల పర్యవేక్షణలో సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా న్యాయ కళాశాలల్లో కన్వీనర్ కోటా ప్రవేశాలకు సంబంధించి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఫార్మసీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, విభాగాధిపతి, బోర్డ్ ఆఫ్ స్టడీస్, డీన్ ఆఫ్ ఫ్యాకల్టీ వంటి కీలక బాధ్యతల భర్తీపైనా నిరక్ష్యం కనిపిస్తోందని విమర్శించారు.అర్హతకు ప్రాధాన్యమా.. అనుకూలతకే పెద్దపీటనా? సమర్థులైన ఆచార్యులకు కీలక బాధ్యతలు అప్పగించకుండా తమకు అనుకూలమైన వారిని కొనసాగిస్తున్నారంటూ ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలపై అధికారుల స్పందన తెలియాల్సి ఉంది. విశ్వవిద్యాలయంలో కీలక పదవుల భర్తీకి అనుసరిస్తున్న విధానం, నియామకాల్లో జరుగుతున్న జాప్యంపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి.విశ్వవిద్యాలయం అంటే కేవలం భవనాలు, తరగతులు, పరీక్షల నిర్వహణ మాత్రమే కాదు. విద్యా ప్రమాణాలను కాపాడే పాలన, పరిశోధనలకు మార్గనిర్దేశం చేసే వ్యవస్థ, అనుబంధ కళాశాలలను పర్యవేక్షించే నాయకత్వం కూడా అవసరం. ఈ కీలక వ్యవస్థల్లో ఖాళీలు కొనసాగుతుంటే వాటి ప్రభావం విద్యార్థులపై పడకుండా ఎలా అడ్డుకుంటారన్నది ప్రశ్న. ప్రభుత్వం వెంటనే కొత్త పాలక మండలిని నియమించి, ఖాళీగా ఉన్న కీలక పోస్టులను భర్తీ చేయాలని బి సి విద్యార్థి సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తోంది. విశ్వవిద్యాలయ పాలనలో రాజకీయాలకు అతీతంగా విద్యా

# ఓట్ల లెక్కింపు కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తికి చర్యలు

## - పివికెఎన్ డిగ్రీ కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రంను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



**చిత్తూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపిటీసీ ఎన్నికలకు సంబంధించి చిత్తూరు పివికెఎన్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో అవసరమైన అన్ని ఏర్పాట్లను అక్టోబర్ 31వ తేదీలోపు చేపట్టి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. చిత్తూరు పివికెఎన్ డిగ్రీ కళాశాలలోని ఓట్ల లెక్కింపు కేంద్రంను ఆదివారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మున్సిపల్ కమీషనర్ రాజేంద్రప్రసాద్, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులునాయుడుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై జెసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా నిర్వహించడానికి అనువుగా కౌంటింగ్ హాళ్ళు, గదులు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అవసరమై ఏర్పాట్లను ఆయన పరిశీలించి లోటు పాట్లు లేకుండా పక్కా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బందికి భోజన సదుపాయం, మంచినీటి వసతి కల్పించడంతో పాటు కేంద్రం వద్ద రిసెప్షన్, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ నుండి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాళ్ళకు తరలించే సమయంలో ఏ పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను ఏ కౌంటింగ్ టేబుల్ వద్దకు పంపించాలనే విషయంలో స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు. బ్యాలెట్ బాక్సుల పంపిణీ, తరలింపు ప్రక్రియలో ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌళిక సదుపాయాలు, సిబ్బందికి వసతులు, ఇతర ఏర్పాట్లన్నింటినీ నిర్ధేశిత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు.

## తిరుపతిలో వైకాపా అభ్యర్థులకు నామినేషన్లలో అన్యాయం

– నీలం బాలాజీ ఆరోపణ



తిరుపతి హెల్త్, అక్టోబర్ 25, ప్రభాతవార్త

తిరుపతితో సహా రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని, కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని వైసిపి రాష్ట్ర కార్యదర్శి నీలం బాలాజీ ఆరోపించారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో వైఎస్సార్‌సీపీ టీఎన్ఎస్సీ వర్కింగ్ ప్రెసిడెంట్ నవనీ వెంకేష్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు కవిత, నగర మహిళా అధ్యక్షురాలు రాధతో కలిసి ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు నిన్నటి ప్రెస్ మీట్‌లో భాగంగా చేసిన వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామని, తిరుపతి నుంచి చిత్తూరు, శ్రీకాకుళం వరకు అనేక జిల్లాల్లో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా పోలీసు,రెవెన్యూ యంత్రాంగాన్ని అడ్డుపెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్లలోనూ తమ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, ప్రశాంతంగా జరగాల్సిన ప్రక్రియలో దౌర్జన్యానికి పాల్పడ్డారని విమర్శించారు. మహిళా కార్యకర్తలపై కూడా దాడులు చేశారని, వారి దుస్తులు చించేంతగా అనుచితంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ అక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో తిరుపతి ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## రేపు మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ

**శాంతిపురం, అక్టోబర్ 25 ప్రభాతవార్త.**

ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 27వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందని ఆర్వో రబ్బానీ భాష, ఏఆర్ఓ ఏపీఆర్ కుమార్ తెలిపారు. ఎవరైనా అభ్యర్థులు తమ నామినేషన్ ఉపసంహరించుకోవాలనుకుంటే నిర్ణీత ఫారం 7 ను పూర్తిగా నింపి స్వయంగా అభ్యర్థి హాజరై సంతకం చేసి ఫారాన్ని సమర్పించాలని సూచించారు. అలాగే చెక్‌లిస్ట్ మరియు రసీదును తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. అలాగే రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులు కూడా బి ఫారాలను 27వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల్లోగా సమర్పించాల్సి ఉంటుందన్నారు.

## నలుగురు ఎంపిటిసి అభ్యర్థులు ఉపసంహరణ

**రామకుప్పం, అక్టోబర్ 25 ప్రభాతవార్త**

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ అభ్యర్థులు నలుగురు ఉపసంహరణ చేసుకున్నట్లు ఆర్వో రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ముద్దనపల్లికి చెందిన సెల్వి, సింగసముద్రం చెందిన పుష్పమ్మ, విజలపురం చెందిన ప్రమీల, బల్లకు చెందిన శంకరప్ప తమ నామినేషన్లను ఉపసంహరణ చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అశ్విని, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



## గాదెల ఎంపిటిసిగా

### నాయుడోరి రమణ ఏకగ్రీవం!

**రైల్వే కోడూరు అక్టోబర్ 25 ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వంలో టిడిపి నుండి మండలంలోని గాదెల ఎంపిటిసి అభ్యర్థి నాయుడోరి రమణ ఒక సెట్ నామినేషన్ పత్రం దాఖలుతోనే ఆ స్థానాన్ని దక్కించు కున్నారు. నియోజకవర్గం లోని ఐదు మండలాలలో 76ఎం. పి. టి. సి. స్థానాలుంటే నాలుగు నుండి పదివరకు నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే చివరకు గాదెల ఎంపిటిసిగా ఒక్కరే నాయుడోరి రమణ నామినేషన్‌తో ఏకగ్రీవమయ్యాడు.

## నామినేషన్ తిరస్కరణపై కలెక్టర్‌కు ఫిర్యాదు



విజయపురం, అక్టోబరు 25 ప్రభాతవార్త:

విజయపురం మండలం కోసలనగరం ఎంపీటీసీ అభ్యర్థి భవాని నామినేషన్ తిరస్కరణపై జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేసి, నిబంధనల ప్రకారంన్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం అందించిన అనంతరం వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన భవాని మాట్లాడుతూ నామినేషన్ వేసినప్పుడు సక్రమంగా డాక్యుమెంట్స్ ప్రొడ్యూస్ చేసినప్పటికీ అధికారులు అధికార పార్టీనాయకులతో కుమ్మకై నామినేషన్ తిరస్కరణకు గురయ్యే విధంగా అనుసరించారని ఆరోపణ చేశారు. న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని, అవసరమైతే కోర్టులో కూడా కేసు వేస్తామని తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు ఎంతవరకైనా పోరాడతానని మాజీమంత్రి రోజా స్పష్టం చేశారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

కమిషనర్ జయకృష్ణ

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 25 ప్రభాతవార్త

ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఈ నెల 26వ తేదీ నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల సందర్బంగా రద్దు చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ జయకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల వలన సోమవారం పి.జి.ఆర్.ఎస్. రద్దు చేశామని, కావున ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని తెలిపారు.

## నేడు గంగమ్మ ఆలయంలో ఛండీహోమం



తిరుపతి,అక్టోబర్ 25ప్రభాతవార్త:

తిరుపతి నగర గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో సోమవారం ఉదయం చండీ హోమం నిర్వహిస్తున్నారు. ఈ హోమంలో పాల్గొనదలచిన గృహస్థభక్తులు వెయ్యిరూపాయలు చెల్లించి హోమంలో పాల్గొనవచ్చునని ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ ,ఈఓ ఎ. జయకుమార్ తెలిపారు

## కుప్పం మున్సిపల్ చైర్మన్ బరిలో 6 మంది

19 వార్డుల్లో కౌన్సిలర్లుగా 53 మంది పోటీ



**కుప్పం,అక్టోబర్ 25 ప్రభాతవార్త**

రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన కుప్పం మున్సిపాలిటీలో మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థులుగా వారి ముందు బరిలో ఉన్నట్లు 6 మంది బరిలో ఉన్నట్లు మున్సిపల్ కమిషనర్ వీఆర్వో శ్రీనివాసరావు తెలిపారు.తెలుగుదేశం పార్టీ తరపున రాజ్‌కుమార్, వైకాపా నుంచి బి. విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ తరపున పళని, బి ఎస్ పి తరపున గణేష్, స్వతంత్ర అభ్యర్థులుగా నాగరాజు, మమత ఉన్నారు. అదేవిధంగా 13 వార్డులు ఏకగ్రీవం ,19 వార్డులకు సంబంధించి కౌన్సిలర్లుగా 53 మంది ఎన్నికల బరిలో ఉన్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆదివారం మధ్యాహ్నం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాలను వెల్లడించారు.



## నామినేషన్ల తిరస్కరణపై అప్పీళ్లు నిల్

కుప్పం ఆర్డీవో షేక్ మహమ్మద్ హుస్సేన్

**కుప్పం, అక్టోబర్ 25 ప్రభాతవార్త.**

ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి కుప్పం నియోజకవర్గంలో తిరస్కరణకు గురైన మూడు నామినేషన్లకు సంబంధించి అభ్యర్థుల నుంచి ఎలాంటి దరఖాస్తులు అందలేదని కుప్పం ఆర్డీవో షేక్ మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం మండలంలో ఒక్కో నామినేషన్ తిరస్కరణకు గురైన విషయం విదితమే.

## అభ్యర్థిత్వాల ఉపసంహరణకు నో.. బరిలో నిలిచిన అభ్యర్థులు!

– పోటీ నుంచి వెనక్కి తగ్గని అభ్యర్థులు

**పూతలపట్టు, అక్టోబర్ 25, ప్రభాతవార్త**

మండలంలో బైటపల్లి, పంటపల్లి ఎం బండపల్లి పూతలపట్టు 1, పూతలపట్టు 2, చిడిపిరాల పాటూరు పికొత్తకోట వేపనపల్లి వడ్డేపల్లి వావిల్ తోట, అయ్యప్ప గారి పల్లి, తేనెపల్లి ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసినా ఒక్క అభ్యర్థి కూడా తమ అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకోకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులంతా పోటీకి సిద్ధమవుతుండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు ఇతర అభ్యర్థులు కూడా పోటీలో కొనసాగుతుండటంతో ఎన్నికల సమీకరణాలు ఎలా మారుతాయన్న దానిపై ప్రజల్లో చర్చ జరుగుతోంది. ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు అభ్యర్థులు ప్రచారానికి సిద్ధమవుతున్నారు. అభ్యర్థిత్వాల ఉపసంహరణ లేకపోవడంతో ఎన్నికల పోటీ మరింత ఆసక్తికరంగా మారనుంది. ప్రజల నమ్మకాన్ని గెలుచుకుని విజయం సాధించేందుకు అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. చివరకు ఓటర్లు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాల్సిందే. ప్రజాస్వామ్యంలో ఓటరే నిర్ణేత. అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించేది ప్రజల తీర్పే..

## కుప్పం మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులు వీరే !!

**కుప్పం, అక్టోబర్ 25 ప్రభాతవార్త**

కుప్పం మున్సిపాలిటీలోని 19 వార్డు కౌన్సిలర్లకు జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఆదివారం ఏ ఆర్ ఓ , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అభ్యర్థుల వివరాలను ప్రకటించారు . 1వ వార్డులో ఆది (టిడిపి) , పొన్ను సెల్వం( వైసిపి ), 2 వార్డులో రామచంద్రప్ప( టీడీపీ) సంపత్ (వైసిపి), 3 వార్డులో వెంకటకృష్ణ (టిడిపి) హనుమంతు( వైసిపి), 4 వార్డులో గాయత్రి (టిడిపి) శకుంతలమ్మ (వైసిపి), 7 వార్డులో నందగోపాల్ (టిడిపి )సిపి మనోహర్ (వైసిపి )8వ వార్డులో చందు కిరణ్( టిడిపి) కమల్( వైసీపీ )డిఎస్ ప్రదీప్ (స్వతంత్ర), 9వ వార్డులో వెంకటాచలం (టిడిపి ),దేవరాజు( వైసిపి) 10వ వార్డులో రాజేష్ (టిడిపి )నాగరాజు( వైసిపి) గుణశేఖర్ (స్వతంత్ర), 11వ వార్డులో ధనలక్ష్మి మూర్తి (వైసిపి) కళ (టిడిపి) 12వ వార్డులో షకీ నా( టిడిపి) రేష్మ (వైసిపి ),దిల్షాద్ (స్వతంత్ర ),14వ వార్డులో ఆఖిల (టిడిపి ), పుంగోడి (వైసిపి), ప్రమీల ,సంపూర్ణ (స్వతంత్ర), 15వ వార్డులో కస్తూరి (టిడిపి) లక్ష్మి (వైసిపి ),16వ వార్డులో మోహన్ రామ్ (వైసీపీ) రవి (టిడిపి ),17వ వార్డులో భవాని (టిడిపి ),సుల్తానా (వైసిపి ),సరసమ్మ (స్వతంత్ర ),21 వార్డులో హంస (టిడిపి) సావిత్రి (వైసిపి ),కస్తూరి, సుబ్బలక్ష్మి (స్వతంత్ర), 27 వార్డులో శ్యామసుందర్( టిడిపి) కిషోర్ కుమార్ (వైసీపీ) నరేంద్ర (స్వతంత్ర), 29వ వార్డులో విజయలక్ష్మి (టిడిపి), కుమారి (వైసిపి) నదియా,సుమయ్య (స్వతంత్ర ),31వ వార్డులో సుమిత్ర (టిడిపి), ఈశ్వరమ్మ (వైసిపి), నవీన, పద్మజ ,మునిరత్న,రంజని( స్వతంత్ర ) , 32 వ వార్డులో రాధమ్మ (టిడిపి) మంజుల (వైసిపి )అభ్యర్థులుగా కౌన్సిలర్ ఎన్నికల బరిలో ఉన్నారు.

## జనసేనకు షాక్

### వైసీపీ తీర్థం పుచ్చుకున్న కాపు సంఘం అధ్యక్షుడు

శ్రీకాళహస్తి అక్టోబర్ 25 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి భారీ ఊపు వచ్చింది. శ్రీకాళహస్తి నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షుడు జనసేన నాయకులు గరికపాటి చంద్ర వైఎస్ఆర్సిపి పార్టీలో చేరారు. ఆయన పార్టీ తీర్థం పుచ్చు కోవడంతో నియోజకవర్గంలో వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. గరికపాటి చంద్ర వైఎస్ఆర్సిపిలో చేరిన సందర్భంగా ముస్లిం మైనారిటీ నాయకులు వార్డు సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు పఠాన్ ఫరీద్, ఫజల్, జుమ్లేషా, కాలేషా, ఫిరోజ్, షాకీర్, శివ, హుమైన్ షైక్, అమ్మన్, దివ్యా కాంత్ రెడ్డి, లోకేష్ రెడ్డి, షేక్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అభివృద్ధి, సేవా కార్యక్రమాలను చూసి గరికపాటి చంద్ర పార్టీలోకి వచ్చారని అన్నారు. ఆయన రాకతో నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## గణనాథుని సేవలో అన్నమయ్య జిల్లా ఎన్నికల పరిశీలకులు

కాణిపాకం, అక్టోబర్ 25 ప్రభాతవార్త:



అన్నమయ్య జిల్లా ఎన్నికల పరిశీలకులు బాలకృష్ణ ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే వారు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవాణీ ట్రస్ట్‌చే ఉచిత వైద్య శిబిరం



**కాణిపాకం, అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ఆదివారం చిత్తూరు శ్రీవాణీ ట్రస్ట్ వారిచే ఉచిత వైద్యశిభిరాన్ని నిర్వహించారు. దేవస్థానం ఆస్థాన మండపంలో ఈఉచిత వైద్యశిభిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థానం సిబ్బంది, పరిసర గ్రామస్థులకు, భక్తులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, ట్రస్ట్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు ముగిసే వరకు పోలీసు గ్రీవెన్స్ రద్దు

**చిత్తూరుహెల్త్, అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం చిత్తూరు జిల్లా పాత పోలీసు కార్యాలయంలో నిర్వహించే పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను రద్దు చేస్తున్నట్లు ఎస్పీ తుషార్ డూడి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎవ్వరు సోమవారం సమస్యలు చేతబట్టి చిత్తూరుకు రావద్దని ఎస్పీ తుషార్ డూడి విజ్ఞప్తి చేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికల ఎఫెక్ట్

– ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

**చిత్తూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల ఎఫెక్ట్ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంపై పడింది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల పూర్తయ్యే వరకు ప్రజలు ఎవ్వరు సమస్యలపై అర్జీలు చేతపట్టుకుని సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

## చర్చి అభివృద్ధికి రూ.1 లక్ష విరాళం

**చిత్తూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త:**



యాదమరి మండలం కోణాపల్లి గ్రామంలోని చర్చి అభివృద్ధికి అదే గ్రామంకు చెందిన అర్టీసీ కండెక్టర్ కుమార్‌నాయుడు, విజయలక్ష్మీ దంపతులు ఒక లక్ష రూపాయల విరాళంను చర్చి నిర్వాహకులకు అందజేశారు. చర్చి అభివృద్ధి కోసం విరాళం అందజేసిన కుమార్‌నాయుడు, ఆయన సతీమణి విజయ లక్ష్మీలను చర్చి నిర్వాహకులు సత్కరించారు. ఈ సందర్భంగా కుమార్‌నాయుడు మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన గ్రామంలో చర్చి అభివృద్ధి కోసం తన వంతు సహాయం అందిస్తున్నానని పేర్కొన్నారు. ఈ సందర్బంగాచర్చిపాస్టర్లు కుమార్‌నాయుడు, ఆయన సతీమణి విజయలక్ష్మీ, పిల్లలను ఆశీర్వచరం చేశారు.

## శ్వాస సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



**చిత్తూరుహెల్త్, అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

నిద్రలో శ్వాసకు అంతరాయం కల్గించే సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నితిన్ ఎం.నగార్కర్, ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె.అగస్టీన్, యూనిట్ హెడ్ ఎస్.బాలరాజ్‌లు పేర్కొన్నారు. చిత్తూరు ది అపోలో యూనివర్సిటీ(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్)లో ఆదివారం చెవి, ముక్కు, గొంతు, హెడ్, నెక్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సమావేశంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ నితిన్ ఎం.నగార్కర్ మాట్లాడుతూ నిద్ర సంబంధిత సమస్యలు ఇతర ఆరోగ్య సమస్యలపై ప్రభావం చూపుతాయన్నారు. వాటి గుర్తింపు, నిర్ధారణ, చికిత్సలో వివిధ వైద్య విభాగాల నిపుణుల సమన్వయం కీలకమన్నారు. ఇలాంటి వైద్య సదస్సులు వైద్య విద్యార్థులు, అధ్యాపకులకు నిపుణుల అనుభవాల నుండి నేర్చుకోవడానికి, వైద్య రంగంలో వస్తున్న ఆధునిక చికిత్సా విధానాలపై అవగాహన పెంపొందించుకోవడానికి దోహదపడుతాయన్నారు. తమిళనాడే వేలూరు సిఎంసి పల్మనాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుజిత్ చాండి ఈ సందర్భంగా నిద్ర ప్రక్రియ, నిద్రలో శ్వాసకు అడ్డంకి ఏర్పడే సమస్య వల్ల శరీరంలో కలిగే మార్పులు, స్లీప్ స్టడీ ఫలితాల విశ్లేషణ, సీపాస్, బైపాస్ చికిత్సా విధానాలపై వివరించారు. చెన్నై ఎంఇఆర్ఎఫ్ స్లీప్ డిజార్డర్స్ విభాగాధిపతి డాక్టర్ విజయకృష్ణన్ ఎగువ శ్వాసనాళాల పరీక్షలు, చిన్నారుల్లో నిద్ర సంబంధిత శ్వాస సమస్యలు, చికిత్సలో ఎదురయ్యే సవాళ్ళు, ప్రత్యామ్నాయ చికిత్సా విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రీ-టెస్ట్, పోస్ట్ టెస్ట్ నిర్వహించారుఈఎన్టీ అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొగ్రాం కో-అర్డినేటర్ డాక్టర్ ప్రతాప్‌కుమార్, వైద్యులు, అధ్యాపకులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు పక్కా భద్రతా ఏర్పాట్లు

**- శాంతి భద్రతలకు విఘాతం కల్పించినా చట్ట ప్రకారం చర్యలు - ఎస్పీ తుషార్ డూడి**



చిత్తూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త: జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా మున్సిపాల్టీల పరిధిలో నామినేషన్ల ప్రక్రియ ఆదివారంతో పూర్తయ్యిందని, ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం పక్కా భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని ఎస్పీ తుషార్ డూడి పేర్కొన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 60 డివిజన్లు వుండగా వీటిలో 51 డివిజన్లు ఏకగ్రీవం అయ్యాయని, మిగిలిన 9 డివిజన్లకు ఎన్నికలు జరుగుతున్నాయని, పలమనేరు మున్సిపాల్టీలో మొత్తం 36 వార్డులు వుండగా 6 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని, మిగిలిన 30 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. అలాగే కుప్పం మున్సిపాల్టీలో మొత్తం 32 వార్డుల్లో 13 వార్డులు ఏకగ్రీవం కాగా మిగిలిన 19 వార్డుల్లో, నగరి మున్సిపాల్టీలో మొత్తం 40 వార్డులు వుండగా 4 ఏకగ్రీవం అయ్యాయని, మిగిలిన 36 వార్డుల్లో ఎన్నికలు జరుగనున్నాయన్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీల పరిధిలో మొత్తం 168 వార్డులకు 74 వార్డులు ఏకగ్రీవం కాగా, 94 వార్డుల్లో ఎన్నికలు జరుగనున్నాయన్నారు. నగరి మున్సిపల్ ఛైర్మన్ ఏకగ్రీవం కాగా, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్, పలమనేరు, కుప్పం మున్సిపాల్టీల్లో మున్సిపల్ ఛైర్మన్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చేపట్టిన ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాలో సమస్యాత్మక వ్యక్తులను గుర్తించిందన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్, కుప్పం, నగరి, పలమనేరు మున్సిపాల్టీల పరిధిలో 349 మంది సమస్యాత్మకమైన వ్యక్తులను గుర్తించి 109 మందిపై బైండోవర్ చర్యలు చేపట్టామన్నారు. చిత్తూరులో 122 మంది సమస్యాత్మక వ్యక్తులను గుర్తించి 48 మందిపై, పలమనేరులో 46 మందిని గుర్తించి 31 మందిపై, కుప్పంలో 159 మందిని గుర్తించి 15 మందిపై, నగరిలో 22 మందిని గుర్తించి 15 మందిపై బైండోవర్ చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికలు అనేవి ప్రజాస్వామ్యంకు పునాది వంటివని, ప్రతి ఓటరు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణంను కల్పించడం పోలీసు శాఖ బాధ్యత అన్నారు. ఎన్నికల సమయంలో జిల్లా అంతటా పటిష్టమైన పోలీసు బందోబస్తు, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా, నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయడానికి ప్రయత్నించడం, ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురి చేయడం, డబ్బు లేదా ఇతర వస్తువుల ద్వారా ఓట్లను కొనుగోలు చేయడానికి ప్రయత్నించడం, ప్రత్యర్థులపై దాడులకు పాల్పడడం, అక్రమంగా గుంపులు ఏర్పడి శాంతిభద్రతలకు విఘాతం కల్గించడం, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోను సహించేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు. చట్టంను చేతుల్లో తీసుకునే వారిపై, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే వారిపై, ఎన్నికల ప్రశాంతతకు భంగం కలిగించే వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల విధుల్లో వున్న అధికారులకు సహకారం అందించాలని, ఎవరైనా అక్రమాలకు పాల్పడినా, ఓటర్లను బెదిరించినా, ఎన్నికల శాంతిభద్రతలకు విఘాతం కల్గించినా సత్వరం పోలీసు వాట్సాప్ నెంబర్ 9440900005కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

# వైభవంగా రుద్రపాదాల ముక్కోటి మహోత్సవాలు

**నంది వాహనంపై ఆది దంపతులు**







చంద్రగిరి, అక్టోబర్ 25 ప్రభాతవార్త: ముక్కోటి అగస్త్యేశ్వర స్వామివారి ఆలయంలో జరుగుతున్న ముక్కోటి మహోత్సవాలలో రెండవ రోజు ఆదివారం రాత్రి ఆదిదంపతులు శ్రీఅగస్త్యేశ్వర స్వామి వారు ఆనందవల్లీ అమ్మవారు తమకు అత్యంత ప్రీతిపాత్రమైన నంది వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. తొండవాడ గ్రామంలోని స్వర్ణముఖి నదీతీరాన వెలసియున్న శ్రీ ఆనందవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో ముక్కోటి ఉత్సవాలను ఆలయ ధర్మకర్త మొగిలి ఇందుమౌళిరెడ్డి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయంతుర్యార్యం 12.30 గంటలకు ఆలయ అర్చకులు అగస్త్య మహాముని, లోపముద్రా దేవి వారికి అభిషేకం నిర్వహించారు. తదుపరి 2.30 గంటలకు శ్రీఅగస్త్యేశ్వర స్వామి, ఆనందవల్లీ అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి, వివిధ రకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలు, రుద్రాక్షమాలలతో విశేష అలంకరణ గావించి ఉదయం 4 గంటలకు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి సాయంత్రం 7 గంటలకు నిండు పున్నమిలో శ్రీఅగస్త్యేశ్వర స్వామి వారు ఆనందవల్లీ అమ్మవారి ఉత్సవమూర్తులు తమ నిత్య ఇష్టవాహనమైన నంది వాహనంపై ఊరేగుతూ భక్తులకు అనుగ్రహించారు. చతుర్దశి, పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో మహిళలు పెద్దఎత్తున దీపారాధనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త మొగిలి ఇందుమౌళి రెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమాలు, తీర్థప్రసాదాల వితరణలు, కనీస మౌళిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతలనిస్తూ ఏర్పాట్లు సమన్వయంతం చేశారు. ముఖ్యంగా ఆలయ చరిత్రలో గడచిన వందేళ్లలో మునుపెన్నడూ లేని రీతిన ఆలయాన్ని అద్భుతంగా ముస్తాబు చేయడంతో పాటు కోట్లాది రూపాయలను వెచ్చించి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఈ ప్రాంత ప్రజలు, భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ఏర్పాట్లపై బౌరా అంటూ ప్రశంసలతో ధర్మకర్తకు కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేస్తున్నారు. ముక్కోటి ఉత్సవాలను పురస్కరించుకుని తిరుపతికి చెందిన పరదాల మణి వివిధ ఆకృతులతో రూపొందించి తయారు చేసిన పరదాలను ఆలయ ధర్మకర్తకు అందజేశారు. టిటిడి ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో హరికథ, సంగీత కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

## వరద నీరు అంతా సముద్రం పాలు...

# చెరువులకు మళ్ళించడంలో అధికారుల నిర్లక్ష్యం



చెంబేడు లాగులను ఓపెన్ చేయక...వచ్చిన వరదనీరు సముద్రానికి వెళుతున్న దృశ్యం

తొట్టంబేడు, అక్టోబర్ 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో సువర్ణముఖినదికి వచ్చిన వరద నీటిని సముద్రానికి వదలిపెట్టారు. దాంతో 34 చెరువుల గ్రామాల్లోని రైతుల పంటలకు ఇబ్బందికరంగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో తల్లడిల్లుతున్న రైతుల ఆశలను చిగురింపజేస్తూ వారం రోజులుగా కురిసిన వర్షాలతో స్వర్ణముఖి నదికి సన్నగా వరద వచ్చింది. వర్షపు నీటిని వడిసి పట్టుకోవాలని ప్రభుత్వం రోజూ ప్రకటనలు జారి చేస్తున్నా శ్రీకాళహస్తిలోని ఇరిగేషన్ అధికారులు వచ్చిన వరద నీటిని సముద్రానికి వదలి పెట్టారు. 1956లో 34 చెరువుల ద్వారా సుమారు 20వేల ఎకరాలకు సాగు నీందించేందుకు సువర్ణముఖి నదిపై ఆనకట్ట నిర్మించారు. మూడు మండలాలకు సాగునీరందించేందుకు చెంబేడు కాలువ నిర్మించారు. దీని ద్వారా రైతులు వ్యవసాయం సాగిస్తున్నారు. అయితే ఒక నాటి సువర్ణముఖి నేడు లేదు. నదిలో ఇసుకను తోడేయటంతో నేడు పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. దీనికి తోడు ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది.

**వచ్చిన నీరు అంతా సముద్రం పాలు:**

సెప్టెంబర్‌లో వరదతో కళ కళ లాడాల్సిన సువర్ణముఖి నది ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో బోసి బోయింది. గత వారం రోజులుగా కురిసిన వర్షంతో పాయగా నదికి వరద నీరు వచ్చింది. దానిని మొదటి ప్రాధాన్యతగా రైతులకు అందించాల్సిన ఇరిగేషన్ అధికారులు లాగులను మూసి వేయటంతో వచ్చిన కొద్దిపాటి నీరంతా సముద్రం దిశగా సాగింది. ఆదివారం రైతులు గగ్గోలు పెట్టడం ఇరిగేషన్ శాఖ వద్దకు వచ్చి ఆందోళన చేయగా లాగులు ఓపెన్ చేసారు. రెండు రోజుల పాటు వచ్చిన నీరంతా సముద్రం పాలైంది. చెంబేడు కాలువ ద్వారా తొట్టంబేడు మండలం లోని 11 బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని6 చెరువులకు పెళ్ళకూరు మండలంలోని 29 చెరువులకు సువర్ణముఖి నది నీటిని అందిస్తారు. ప్రస్తుతం చెంబేడు ప్రధాన కాలువ నుంచి చెరువులకు అందించాల్సిన నీరు వృధాగా సముద్రానికి వెళుతుంది. ప్రధాన కాలువ ద్వారా ఫుల్ సప్లై లెవల్ నీరు పారుతుండగా పై నుంచి కూడా ఇన్‌ఫ్లో వస్తుంది.

**రైతుల ఆందోళనలతో...**

సువర్ణముఖి నదికి వరద వచ్చినా చెంబేడు కాలువ ఒట్టిబోవటంతో గమనించిన కాలువ ఆయకట్టు దారులైన పూడి, పెన్నల పాడు, విరుపాక్షపురం, పెద్దగుంట, పాలచ్చూరు, కలవకూరు రైతులు ఆదివారం ఇరిగేషన్ శాఖ దగ్గర ఆందోళనకు దిగారు. అప్పటికి కానీ ఇరిగేషన్ అధికారులకు చలనం కల్గలేదు. రైతులను ఆదుకోవాలనే ధ్యాస రాలేదు. గత వారం వరకు ఎల్‌నినో ప్రభావంతో మంచి నీటికి కట కట ఏర్పడింది. ఈ ఏడాది వ్యవసాయం ప్రశ్నార్థకమే అనుకుంటున్న తరుణంలో వరుణుని కరుణతో వచ్చిన కొద్ది పాటి నీటిని కూడా సద్వినియోగం చేయలేకపోయారు. అన్నదాతలు ఆందోళనకు దిగితే కానీ రైతుల గురించి పట్టించుకోని ఇరిగేషన్ అధికారుల తీరుపై మండి పడుతున్నారు. రైతులు భగ్గుమనగా అధికారుల్లో చలనం వచ్చింది. బాధగా ఒక లాగు ఓపెన్ చేసి చెంబేడు కాలువకు నీటిని విడుదల చేసారు.

# తుఫాను ప్రభావంతో తీరంలో అలజడి

**- 10 మీటర్ల మేర ముందుకొచ్చిన సముద్రం**

**- ఎగసిపడుతున్న అలలు.. మత్స్యకారుల్లో ఆందోళన**



వాకాడు, అక్టోబర్ 25 ప్రభాతవార్త: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫానుగా బలపడే అవకాశం ఉండటంతో తీర ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది. వాకాడు మండలం తుపిలిపాలెం సముద్ర తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. సముద్రం సుమారు 10 మీటర్ల మేర ముందుకు రావడంతో తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. తుఫాను ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారుతుండటంతో మత్స్యకారులు వేటకు వెళ్లేందుకు ఆందోళన చెందుతున్నారు. సముద్రం ముందుకు రావడంతో తీరంలో పరిస్థితులను స్థానికులు నిశితంగా గమనిస్తున్నారు.

**- అప్రమత్తత అవసరం:**

బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం అక్టోబర్ 26 నాటికి తుఫానుగా, ఆ తర్వాత తీవ్ర తుఫానుగా బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. అక్టోబర్ 28 నాటికి ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశమున్న నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని అధికారులు సూచిస్తున్నారు.

## కోర్టులో కేసు వుండగా...

# నగరి ఛైర్మన్‌ను ఎలా ప్రకటిస్తారు?

**-కలెక్టర్‌కు రోజా ఫిర్యాదు**



పుత్తూరు(నగరి), అక్టోబరు 25 ప్రభాతవార్త : హైకోర్టులో కేసు పెండింగ్‌లో వుండగా నగరి మునిసిపల్ ఛైర్మన్ ఎన్నికైనట్టు కమిషనర్ బాలాజీనాయక్, ఎన్నికల అధికారి సంజీవ్‌కుమార్‌లపై వైసిపికి చెందిన పర్యాటక శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా ఆదివారం చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎన్నికల్లో నగరి మునిసిపల్ ఛైర్మన్ అభ్యర్ధిగా నామినేషన్ వేసిన తమ పార్టీ అభ్యర్ధి బాలకృష్ణ నామినేషన్ ఆమోదించినట్టుగా ఎన్నికల అధికారులు ఉదయం రశీదు ఇచ్చి, సాయంత్రాని కల్లా నామినేషన్ చెల్లదని ప్రకటించి, టిడిపి అభ్యర్ధి శ్రీనివాసన్ ఛైర్మన్‌గా ఎన్నికైనట్టు ప్రకటించడంపై రోజా హైకోర్టులో కేసు వేశారు. ఆ కేసు పెండింగ్‌లో వుంది. రెండు రోజుల్లో తీర్పు వచ్చే నేపథ్యంలో నగరి మునిసిపల్ ఛైర్మన్‌గా శ్రీనివాసన్ ఎన్నికైనట్టు పాత తేదీలతో అతనికి డిక్లరేషన్ ఫారం అందించడం అన్యాయం, అప్రజాస్వామికమని రోజా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. లంచాలు తీసుకుని అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. విచారణ జరిపి ఇద్దరు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విజయపురం మండలం కోసలనగరం ఎంపిటిసి అభ్యర్ధి భవాని నామినేషన్ తిరస్కరణ అంశాన్ని కూడా ఆమె కలెక్టర్‌కు తెలిపారు. ఈ విషయంలో కూడా విచారణ జరిపి ఎన్నికల నిబంధనల ప్రకారం న్యాయం చేయాలని కోరారు. ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలపై తాను న్యాయం జరిగే వరకూ పోరాడతానని స్పష్టం చేశారు.

# ప్రభుత్వ ఘోష ఆసుపత్రిని తిరిగి ప్రారంభించేందుకు చర్యలు

**- వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి**



వెంకటగిరి, అక్టోబర్ 25 ప్రభాతవార్త: ప్రభుత్వం ఘోష ఆసుపత్రిని తిరిగి చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామని వైసిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. వెంకటగిరిలోని పౌర సమితి కార్యాలయంలో ఆయన సమితి సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ మున్సిపాలిటీలో పాలకవర్గం ఉన్నప్పుడు మాకేంటి మాకేమిటి అని ప్రజలను ఇబ్బంది పెట్టారని తెలిపారు. వైసిపి వారిని గెలిపిస్తే మీకేం కావాలని మేము అడిగి పనులు చేస్తామని తెలిపారు. గొంతు శారద ఒకసారి చైర్ పర్సన్‌గా పని చేశారని, ఆమె ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఆమెకు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. పౌర సేవా సమితి వారు ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు చేస్తున్న పోరాటం అభినందనీయమన్నారు. పేదల కోసం ఏర్పాటు చేసిన ఘోషాస్పత్రి నిరుపయోగం ఉందని దాన్ని అందరికీ ఉపయోగపడే విధంగా చేస్తామని తెలిపారు. అమృత పథకం కింద తాగునీటి కోసం 120 కోట్ల రూపాయలు అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి మంజూరు చేయించారని తెలిపారు. కోటపై ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు చైర్ పర్సన్‌కు ప్రత్యేక ఎన్నికలు పెట్టి ఒక మంచి పని చేశారని తెలిపారు. వైసీపీ రాష్ట్ర కమిటీ సభ్యులు మస్తాన్ యాదవ్ మాట్లాడుతూ గోశాసుపత్రి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నట్లు. అయితే దీని మూసివేయడం బాధాకరమన్నారు. తాము పోరాటం చేసి తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. అన్యాక్రాంతమవుతున్న కాలేజీ, జడ్పీ ఉన్నత పాఠశాల స్థలాలను కాపాడుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సమితి సభ్యులు బికె ప్రసాద్, రమణారెడ్డి, నరసింహులు, వైసిపి నాయకులు హరికృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల ముందు అబద్ధాలు చెప్పి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిందని చెప్పారు. ఎన్నికల సమయంలో తాను ముందుగా రిలీజ్ చేసిన మేనిఫెస్టోను రామకృష్ణ కాపీ కొట్టాడని విమర్శించారు. కూటమి ప్రభుత్వాలు అభివృద్ధి జరగలేదని విమర్శించారు. సమ్మర్ స్టోరీ ట్యాంకును మా తల్లి రాజలక్ష్మి నిర్మించిందని తెలిపారు. ప్రజా సేవ చేసే అందుకే రాజకీయాల్లోకి వచ్చినట్లు మున్సిపల్ వైసీపీ అభ్యర్థిని బోలిగల దీవెన తెలిపారు. స్థాము స్థానికులం కాదని కొందరు చేస్తున్న ప్రచారం ఆశస్పదంగా ఉందన్నారు. మా భర్త మస్తాన్ యాదవ్ వెంకటగిరిలో పుట్టి వెంకటగిరిలోనే పెరిగారని చెప్పారు. వ్యాపారాల నిమిత్తం హైదరాబాద్ పోయిన మరలా వెంకటగిరి ప్రజలకు సేవ చేయాలని వచ్చినట్లు చెప్పారు. తమ కుటుంబ సభ్యులందరికీ వెంకటగిరిలోనే ఓటు ఉందని తెలిపారు. వైసిపి రాష్ట్ర కమిటీ సభ్యులు మస్తాన్ యాదవ్ మాట్లాడుతూ ప్రజా సేవ చేసేందుకే తాము రాజకీయాలకు వచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలత రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బాలయ్య, మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ, మున్సిపాలిటీ అభ్యర్థులు, నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా పౌర్ణమి ఊంజలి సేవ



శ్రీకాళహస్తి, అక్టోబర్ 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా స్వామి అమ్మవార్లకు ఘనంగా పౌర్ణమి ఊంజలి సేవ నిర్వహించారు. విశేషంగా అలంకరించిన స్వామి అమ్మవార్లను ప్రత్యేక పూజలు అనంతరం రాయలవారి కోట మండపంలో జరిగిన ఊంజలి సేవలో పాల్గొని భక్తులు పునీతులైనారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి, సభ్యులు గుర్రప్పశెట్టి, కోలా వైశాలి, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్‌లు పాల్గొన్నారు.

# మున్సిపల్ బరిలో 78 మంది అభ్యర్థులు

సూళ్లూరుపేట, అక్టోబర్ 25 ప్రభాతవార్త: సూళ్లూరుపేట మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి తుది జాబితాను ఆదివారం అధికారులు ప్రకటించారు. తుది జాబితా ప్రకారం 32 వార్డులకు సంబంధించి 78 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో మిగిలారు. ఇందులో 11,24 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. 11వ వార్డులో తెలుగుదేశం అభ్యర్థి దంతాల మోహన సుందరి, 24వ వార్డులో సూరపు మీనా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు తెలిపారు. చైర్మన్ బరిలో 6అభ్యర్థులు రంగంలో ఉన్నారు తెలుగుదేశం పార్టీ తరఫున పిట్ల సుహాసిని, వైసీపీ తరఫున మోడీ విమల కుమారి, కాంగ్రెస్ పార్టీ తరఫున వేలూరు మునెమ్మ, స్వతంత్ర అభ్యర్థులుగా బిగువు రేణుక, మోడీ మునిరోజా, గొర్రెపాటి సునీతారాణి ఎన్నికల బరిలో ఉన్నారు.

# గ్రామదేవతల పొంగళ్ళతో... గ్రామాల్లో సందడి



చేర్లోపల్లి గ్రామంలో అంకమ్మ దేవతకు ప్రత్యేకాలంకరణ

శ్రీకాళహస్తి, అక్టోబర్ 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలంలోని గ్రామాల్లో గ్రామదేవతలకు పొంగళ్ల కార్యక్రమాల్లో జనం తలమునకలై ఉన్నారు. శ్రీకాళహస్తికి సమీపంలోని చెర్లొపల్లి గ్రామంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా అంకమ్మ దేవతకు పొంగళ్ళు పెట్టారు. ఇక్కడ రోడ్డుపక్కనే చక్కటి ఆలయాన్ని అమ్మవారికి నిర్మించారు. ప్రతి ఏడాది ఇక్కడ భారీ ఎత్తున అంకమ్మ పొంగళ్ళు నిర్వహించటం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా ఆదివారం అంకమ్మ దేవతకు పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అంకమ్మ దేవతకు వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. సాయంత్రం అమ్మవారికి పొంగళ్ళు సమర్పించి పూజలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమనమవారికి ప్రత్యేకాలంకారం జరిపారు. ఈ కార్యక్రమాల్లో గ్రామానికి చెందిన పెద్దలు, గ్రామ ప్రజలు, భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకొని దర్శించుకున్నారు.

# 6 మంది నామినేషన్ ఉపసంహరణ : ఎంపీడీవో



బాలాయపల్లి, అక్టోబర్ 25 ప్రభాతవార్త: మండలంలోని 10 ఎంపిటిసి లకు వేసిన నామినేషన్‌లో ఆరు మంది ఉపసంహరించుకున్నట్లు ఎంపీడీవో దాసరి నారాయణ తెలిపారు. జయంపు మద్దూరు సుకన్య, చేకూర్ గీత, కృష్ణవేణి, బాలాయపల్లి మద్దినేని విజయలక్ష్మి, కాట్రగుంట గోల సుకన్య, బాలాయపల్లి చల్ల భవాని నామినేషన్లు ఉపసంహరించుకున్నట్లు తెలిపారు.

# మద్యం షాపులో చోరీ

**-లక్ష రూపాయల మద్యాన్ని పట్టుకెళ్లారు !!**



కుప్పం, అక్టోబర్ 25 ప్రభాతవార్త: మండలంలోని మల్లానూరు వైన్ షాపులో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు షాపు నిర్వాహకులు తెలిపారు. షాపు షట్టర్లను పగలగొట్టి సిసి కెమెరాలు ధ్వంసం చేశారని తెలిపారు. అలాగే మద్యం షాపులో ఉన్న సుమారు లక్ష విలువచేసే వివిధ రకాల మద్యాన్ని దుండగులు చోరీ చేసి పట్టుకెళ్ళినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

# కొత్త విషయాలతో ప్రధాని...మన్ కీ బాత్ స్ఫూర్తిదాయకం

**-బిజెపి నేత గోపీనాథ్ రెడ్డి**



తిరుపతి, అక్టోబర్ 25ప్రభాతవార్త:ప్రధాని నరేంద్ర మోదీ ప్రతినెలా నిర్వహిస్తున్న మన్ కీ బాత్ కార్యక్రమం ప్రపంచదేశాలకు స్ఫూర్తిదా యకంగా నిలుస్తుందని బిజెపి నాయకుడు గుండాల గోపినాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు వీక్షించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మనస్సులోని భావాలను తెలియజేస్తూ దేశంలోని అన్ని ప్రాంతల ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడే మన్ కి బాత్ కార్యక్రమాని దేశవ్యాప్తంగా మంచి ఆదరణ లభించిందన్నారు. ప్రతినెలా చివరి ఆదివారం జరిగే మన్ కి బాత్ కార్యక్రమాన్ని తాము తప్పకుండా వీక్షిస్తున్నామని ప్రధానమంత్రి కొత్త విషయాలను తెలియజేస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, దీపక్ యాదవ్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి , లోక ప్రభాకర్ నాయుడు, పెరియ స్వామి రాంకుమార్, డిపి ఆనంద్, విగ్రహాల కళ్యాణి, చంగల్రాయ్ ఆచారి, విజయ్ భాస్కర్ రెడ్డి, వెంకటాద్రి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఒక నామినేషన్ ఉపసంహరణ



వెంకటగిరి, అక్టోబర్ 25 ప్రభాతవార్త: వెంకటగిరి వల్లివేడు టిడిపి ఎంపీటీసీ అభ్యర్థి గోను గొడుగు అరుణ్ కుమార్ నామినేషన్ ఉపసంహరించుకున్నట్లు ఆర్వో శ్రీహరి తెలిపారు. ఈనెల 27వ తేదీ వరకు నామినేషన్ ఉపసంహరించుకోవచ్చని చెప్పారు.

# వెంకటగిరి మున్సిపల్ బరిలో 78 మంది అభ్యర్థులు



వెంకటగిరి, అక్టోబర్ 25 ప్రభాతవార్త: పట్టణంలోని 36 వార్డులకు గాను 78 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు కమిషనర్ ఈగ కిరణ్ తెలిపారు. అధికారికంగా అభ్యర్థుల విడుదల చేసినట్లు చెప్పారు. అభ్యర్థులకు గుర్తులను కూడా కేటాయిస్తామని తెలిపారు.

# చంద్రగిరి నుంచే ప్రజా పోరాటం ప్రారంభిస్తాం!



## 142 నామినేషన్ల తిరస్కరణపై చెవిరెడ్డి ధ్వజం అధికారుల తీరుపై వైసీపీ ఆందోళన.. న్యాయం కోసం ఆర్డీఓకు అప్పీళ్లు, న్యాయం జరగకుంటే ప్రజల్లోకి వెళ్తామని వెల్లడి

**తిరుపతి రూరల్, అక్టోబర్ 25 ప్రభాతవార్త :**

చంద్రగిరి నియోజకవర్గంలో ఎంపీటీసీ నామినేషన్ల తిరస్కరణ వ్యవహారం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. తమ పార్టీకి చెందిన 142 మంది ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని ఆరోపిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపతి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వ మాజీ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయగా, చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి న్యాయం కోసం పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. ఆందోళనలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, అభ్యర్థులు అంబేద్కర్ ప్లకార్డులు, జాతీయ జెండాలను చేతబట్టి రోడ్డుపై బైఠాయించారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియలో తమ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ ఎన్నికల అధికారులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. నీతి, నైతిక విలువల గురించి మాట్లాడే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చంద్రగిరి నియోజకవర్గంలో 142 మంది వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురికావడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నామినేషన్ల దాఖలు సమయంలో తమ పార్టీ నాయకులు, అభ్యర్థులపై దాడులు జరిగాయని, రాళ్లు, కర్రలతో దాడులు చేయడంతో 22 మంది గాయపడి ఆసుపత్రుల్లో చేరారని ఆరోపించారు. గాయాలపాలైనప్పటికీ అభ్యర్థులు ధైర్యంగా నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభ్యర్థులను బెదిరించి నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి తమ పార్టీ అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించేలా చేశారని ఆయన ఆరోపించారు. కొందరిని చంపేస్తామని బెదిరించి నామినేషన్ల ఉపసంహరణ పత్రాలపై సంతకాలు తీసుకున్నారని, ఆమోదం పొందిన అభ్యర్థుల కుటుంబాలను సైతం భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం, గ్రామ స్వరాజ్యంపై మహాత్మాగాంధీ కన్న కలలు, ప్రజాస్వామ్య విలువలు ఎక్కడున్నాయని చెవిరెడ్డి ప్రశ్నించారు. యువత ఓటు హక్కు కోసం పోరాడుతున్న తరుణంలో స్థానిక ఎన్నికల ప్రక్రియపై ఇలాంటి ఆరోపణలు రావడం ఆందోళనకరమన్నారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షి ంచేందుకు తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

### చంద్రగిరి నుంచే ప్రజా ఉద్యమం

చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో తమ పార్టీ అభ్యర్థులపై దాడులు, బెదిరింపులు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. అభ్యర్థులపై దాడుల కోసం తమిళనాడు నుంచి బ్లేడ్ బ్యాచ్‌ను తీసుకొచ్చారని విమర్శించారు. నియోజకవర్గంలోని 96 ఎంపీటీసీ స్థానాల్లో 50కి పైగా స్థానాలను ఏకగ్రీవం చేసుకున్నారని పేర్కొంటూ, ఎన్నికల్లో స్వేచ్ఛాయుత పోటీకి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. నామినేషన్ల తిరస్కరణపై బాధిత అభ్యర్థులు ఆర్డీఓకు అప్పీళ్లు చేసుకుంటారని మోహిత్‌రెడ్డి తెలిపారు. అక్కడ కూడా న్యాయం జరగకపోతే ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్నికల ప్రక్రియలో తమకు ఎదురైన పరిస్థితులను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తే ప్రజలు మౌనంగా ఉండరని, కూటమి ప్రభుత్వ పతనానికి చంద్రగిరి నుంచే నాంది పలుకుతామని హెచ్చరించారు. నామినేషన్ల తిరస్కరణపై ఎన్నికల అధికారులు సమగ్రంగా పరిశీలించి నిబంధనల ప్రకారం న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. కాగా, 142 నామినేషన్ల తిరస్కరణ, దాడులు, బెదిరింపులకు సంబంధించిన అంశాలు వైఎస్సార్‌సీపీ నాయకులు చేసిన ఆరోపణలుగా ఉన్నాయి. వాటిపై అధికారిక వివరణ, స్వతంత్ర నిర్ధారణ వెలువడాల్సి ఉంది.



## నామినేషన్ల ఉపసంహరణకు 27 వరకు గడువు

**చిట్వేలి, అక్టోబర్ 25, ప్రభాతవార్త:**

చిట్వేలి మండలంలోని ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు ఈ నెల 27వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి. జయభరత్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25, 26 తేదీల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 27వ తేదీన ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఫారంజు॥ ద్వారా నిబంధనల ప్రకారం ఉపసంహరణ నోటీసు సమర్పించాలని సూచించారు. అధికారి పరిశీలించి ఉపసంహరణ రసీదు ఇస్తారని అన్నారు. ఒకసారి నామినేషన్ ఉపసంహరించుకున్న తర్వాత తిరిగి రద్దు చేసుకునేందుకు అవకాశం ఉండదని అన్నారు.

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు సంబంధించి, ఆయా రాజకీయ పార్టీల అధీకృత ప్రతినిధులు జారీ చేసిన బిఫారాలను (పార్మ్‌బి) సంబంధిత ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. గడువు ముగిసిన అనంతరం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. కావున అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు నిర్ణీత గడువులను పాటించి ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని ఎన్నికల నిర్వహణ అధికారి జి.జయ భరత్ రెడ్డి కోరారు.

## స్థానాలు పూర్తి వివరాలు...

**81 స్థానాలకు. 45 నామినేషన్లు ఆమోదం , 36 నామినేషన్లు తిరస్కరణ**

**ఓబులవారిపల్లి అక్టోబర్ 25 ప్రభాతవార్త**



ఓబులవారిపల్లి మండలంలో ఎంపీటీసీ సభ్యుల నామినేషన్ స్క్రూటీని ప్రక్రియకు సంబంధించి మొత్తం 45 నామినేషన్లు ఆమోదం కాగా 36 నామినేషన్లు తిరస్కరణ అయినట్లు ఆర్ ఓ, సురేష్ కుమార్ తెలిపారు. మొత్తం 16 ఎంపీటీసీలకు టిడిపి 32 ఆమోదం కాగా 15 తిరస్కరణ అయ్యాయి. వైసిపి 8 యాక్సెప్ట్ కాగా 13 రిజెక్ట్ అయ్యాయి జనసేన 5 యాక్సెప్ట్ కాగా 1 రిజెక్ట్ అయింది ఇండిపెండెంట్ ఎంపీటీసీ అభ్యర్థులకు గాను 7 నామినేషన్ రిజెక్ట్ అయినట్లు తెలిపారు మొత్తం 81 అప్లికేషన్ దాఖలు కాగా పైన తెలిపిన విధంగా ఆయా పంచాయతీలుగాను ఎంపీటీసీ అభ్యర్థులను ఖరారు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా మంగంపేట ఎంపీటీసీ అభ్యర్థిగాను కొంత ఆందోళన చెందినప్పటికీ పోలీసులు జోక్యంతో ఎక్కడ ఎటువంటి సమస్యలు లేకుండా యాక్సెప్ట్ చేయడం జరిగిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర. తాసిల్దార్ సిద్దేశ్వర రావు ఎంపీడీవో కృష్ణయ్య యుపిఆర్డి రామ్మోహన్ రెడ్డి సిఐ దేవేంద్ర ఎస్ఐ సుజన్ కుమార్

## బుడుగుంటపల్లి రైల్వే బ్రిడ్జి కింద వెళితే మోటార్ బైక్ ఖండమే....



**రైల్వే కోడూరు రూరల్, అక్టోబర్ 25 ప్రభాతవార్త**

రైల్వేకోడూరు నుండి బుడుగుంటపల్లికు వెళ్లేందుకు రైల్వే ఉన్నతాధికారులు అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని నిర్మించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షానికి బ్రిడ్జి కింద దాదాపు 5 అడుగుల నీరు నిలవడంతో వాహనదారులు తెలిసో తెలియక వెళ్లడంతో పూర్తిగా వాహనాలు చెడిపోవడం జరుగుతుందని వాహనదారులు బోరున విలపించారు. గత కొంతకాలంగా ఈ మార్గంలో వర్షం పడితే వాహనాలు చెడిపోవడం జరుగుతుందని రైల్వే వారు అత్యంత ప్రతిష్టాత్మ కంగా నిర్మించిన ఈ అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నీరు వెళ్లేందుకు కూడా ఏర్పాట్లు చేసినా కూడా సంబంధిత నీరు ఎటు వెళ్లకుండా తూము వద్ద నీరు నిలిచిపోవడంతో వాహనదారులు పలు రకాల ఇక్కట్లకు గురవుతున్నారు. దీనికి రైల్వే ఉన్నతాధికారులు ఆదివారం సాయంత్రం 6 గంటలకు పైగా మోటార్ను ఏర్పాటు చేసిన,ఆ మోటర్ పనిచేయక వాహనదారులు పలు ఇక్కట్లకు గురిచేసింది. ఇప్పటికైనా రైల్వే అధికారులు తూము వద్ద ఉన్న నీరును తోడువేసి వాహనదారులకు సహాయ పడగలరని వాహనదారులు రైల్వే అధికారులను కోరుకుంటున్నారు. ఇప్పటికే దాదాపు 60 వాహనాలు పూర్తిస్థాయిలో చెడిపోయినట్లు స్థానికులు వివరించారు.

## రేణిగుంట ఎంపీపీ పీఠం కూటమిదే!

**టీడీపీ ఖాతాలో అత్యధిక స్థానాలు.. జనసేనకు రెండు స్థానాలు**



రేణిగుంట, అక్టోబర్ 25 ప్రభాతవార్త:

రేణిగుంట మండల ప్రజా పరిషత్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ఆధిపత్యం స్పష్టమైనది ఎంపీటీసీ స్థానాల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియతో మండలంలో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. ఆదివారం ఉదయం ప్రారంభమైన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగింది. ఈ క్రమంలో వివిధ పార్టీలకు చెందిన 18 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో పలు ఎంపీటీసీ స్థానాల్లో పోటీ స్వరూపం మారగా, అతి తక్కువ స్థానాల్లో అభ్యర్థుల మధ్య పోటీ కొనసాగనుంది. తాజా పరిణామాలతో రేణిగుంట మండల పరిషత్‌పై తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి పట్టు సాధించింది. మండలంలోని ఎంపీటీసీ స్థానాల్లో అత్యధిక స్థానాలను తెలుగుదేశం పార్టీ తన ఖాతాలో వేసుకోగా, జనసేన పార్టీకి రెండు స్థానాలు దక్కాయి. దీంతో మండల పరిషత్‌పై కూటమి గెలుపు జెండా ఎగరవేయనుంది . స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పట్టును నిలబెట్టుకునేందుకు వివిధ రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతుండగా, నామినేషన్ల ఉపసంహరణ పరిణామాలు ఆయా పార్టీల బలాబలాలను ప్రతిబింబిస్తున్నాయి. అయితే, కొన్ని స్థానాల్లో అభ్యర్థులు బరిలో నిలవడంతో అక్కడ ఎన్నికల పోరు తప్పనిసరిగా మారే పరిస్థితి కనిపిస్తోంది. కూటమి సీట్ల పంపకాల్లో భాగంగా జి.పాలెం ఎంపీటీసీ స్థానాన్ని భారతీయ జనతా పార్టీకి కేటాయించారు. అయితే, ఈ స్థానంలో ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. ఆదివారం సాయంత్రం వరకు వారు తమ నామినేషన్లను ఉపసంహరించుకోకపోవడంతో ఈ స్థానంలో పై ఉత్కంఠ నెలకొంది. అదేవిధంగా కరకంబాడి1 ఎంపీటీసీ స్థానంలో తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు బరిలో ఉండటంతో ఈ స్థానానికి సంబంధించిన పరిణామాలు కూడా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా ఈ స్థానాలపై తుది స్పష్టత రావాల్సి ఉంది. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగియడంతో ఏయే స్థానాల్లో అభ్యర్థులు తుది పోటీలో నిలిచారు, ఎన్ని స్థానాలకు ఎన్నికలుఅనివార్యమవుతున్నాయి, ఎన్ని స్థానాల్లో ఏకగ్రీవానికి అవకాశం ఉందనే అంశాలపై స్పష్టత రానుంది. దీంతో రేణిగుంట మండల రాజకీయాల్లో తదుపరి పరిణామాలపై ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించే కీలక ఘట్టంగా నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిలిచింది.

నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియను రిటర్నింగ్ అధికారి ఆదినారాయణ, ఎంపీడీవో రవిచంద్ర తదితర అధికారులు పర్యవేక్షి ంచారు.

# జీర్ణకోశ వ్యాధుల చికిత్సలో విప్లవాత్మక మార్పులు




తిరుపతి హెల్త్, అక్టోబర్ 25, ప్రభాతవార్త

## - స్విమ్స్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో 56వ అంతర్జాతీయ గ్యాస్ట్రో సైన్సెస్ సదస్సు - ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన డా. గుడూరు జగదీష్

ప్రపంచ వ్యాప్తంగా వైద్యరంగంలో చోటుచేసుకుంటున్న అత్యాధునిక ఆవిష్కరణలు, కృత్రిమ మేధస్సు, రోబోటిక్ శస్త్ర చికిత్సలు, వ్యక్తిగతీకరించిన వైద్య విధానాలు, వివిధ వైద్య విభాగాల మధ్య సమన్వయం ద్వారా జీర్ణకోశ, కాలేయ, పాంక్రియాస్ సంబంధిత వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో విప్లవాత్మక మార్పులు సాధ్యమవుతున్నాయని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరణలు, సమన్వయం, వ్యక్తిగతీకరించిన వైద్య విధానాల ద్వారా జీర్ణకోశ ఆరోగ్య పరిరక్షణలో పురోగతి అనే ప్రధాన ఇతివృత్తంతో నిర్వహించిన 56వ అంతర్జాతీయ గ్యాస్ట్రో సైన్సెస్ సదస్సు (వెబినార్)లో డాక్టర్ గుడారు జగదీష్ ముఖ్య అతిథిగా పాల్గొని సదస్సును ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా భారతదేశంతో పాటు అమెరికా తదితర దేశాలకు చెందిన ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు, హెపటాలజిస్టులు, గ్యాస్ట్రోఇంటెస్టైనల్ సర్జన్లు, ఇతర వైద్య నిపుణులు ఒకే అంతర్జాతీయ వేదికపై సమావేశమై ఆధునిక వైద్య పరిజ్ఞానాన్ని పంచుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్న ఆర్గనైజింగ్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ రాయపు రమేష్ బాబు, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు, నిర్వాహక బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ గుడారు జగదీష్ మాట్లాడుతూ, మానవ శరీరంలో జీర్ణవ్యవస్థ కేవలం ఆహారాన్ని జీర్ణం చేయడానికే పరిమితం కాదని, శరీర పోషణ, జీవక్రియలు, రోగనిరోధక శక్తి, సమగ్ర ఆరోగ్య పరిరక్షణలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని వివరించారు. ప్రస్తుత జీవనశైలిలో వస్తున్న మార్పులు, అధిక బరువు, శారీరక శ్రమ తగ్గడం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మద్యపానం, మధుమేహం, జీవక్రియ సంబంధిత సమస్యల కారణంగా జీర్ణకోశ, కాలేయ వ్యాధుల భారం పెరుగుతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా జీర్ణకోశ క్యాన్సర్లు, దీర్ఘకాలిక కాలేయ వ్యాధులు, ఫ్యాటీ లివర్ వ్యాధి, పేగుల వాపు సంబంధిత వ్యాధులు, పాంక్రియాస్ సమస్యలు ప్రజారోగ్యానికి సవాలుగా మారుతున్నాయని తెలిపారు. వ్యాధి ముదిరిన తరువాత అత్యంత ఖరీదైన చికిత్స అందించడం కంటే, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి నివారించడం ద్వారా వేలాది కుటుంబాలను ఆరోగ్యపరమైన, ఆర్థికపరమైన ఇబ్బందుల నుంచి రక్షించవచ్చు అని స్పష్టం చేశారు. డాక్టర్ గుడారు జగదీష్ మాట్లాడుతూ ఆధునిక వైద్యరంగంలో ఎంతటి శాస్త్రీయ పురోగతి సాధించినా దాని అంతిమ లక్ష్యం మానవ జీవితాలను మెరుగుపరచడమే కావాలని పేర్కొన్నారు. ఆవిష్కరణలు వైద్యరంగానికి కొత్త అవకాశాలను అందిస్తాయి. వైద్య విభాగాల సమన్వయం మరింత బలాన్ని చేకూరుస్తుంది. ప్రెసిషన్ మెడిసిన్ చికిత్సలో ఖచ్చితత్వాన్ని పెంచుతుంది. అయితే మానవత్వం, కరుణ, సేవాభావమే వైద్య వృత్తికి నిజమైన అర్థాన్ని, పరిపూర్ణతను అందిస్తాయి అని ఉద్ఘాటించారు. అనంతరం సదస్సు నిర్వాహకులు, అంతర్జాతీయ వైద్య నిపుణులు, భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పాల్గొన్న ప్రతినిధులు, యువ వైద్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ రాయపు రమేష్ బాబు, ఎస్వీఎంసీఏఏ ప్రతినిధులు, దేశవిదేశాలకు చెందిన గ్యాస్ట్రోఎంటరాలజీ, హెపటాలజీ, గ్యాస్ట్రోఇంటెస్టైనల్ సర్జరీ తదితర విభాగాల ప్రముఖ వైద్య నిపుణులు, అధ్యాపకులు, యువ వైద్యులు వెబినార్ ద్వారా పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## సైనిక విద్యకు బాలికలకు అవకాశం

ఆరో తరగతి ప్రవేశాలకు జనవరి 17న పరీక్ష

**తిరుపతి విద్య, అక్టోబర్ 25 ప్రభాతవార్త**




బాలికలకు సైనిక విద్యను అభ్యసించే అవకాశాన్ని కల్పించే కిట్టూరు రాణి చెన్నమ్మ రెసిడెన్షియల్ సైనిక్ స్కూల్‌లో 2027-28 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. కర్ణాటక రాష్ట్రంలోని ఈ పాఠశాలలో ప్రవేశాల కోసం 2027 జనవరి 17న జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డా. ఎన్. విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. సైనిక విద్యపై ఆసక్తి ఉన్న బాలికలు ఇప్పటి నుంచే పరీక్షకు సన్నద్ధం కావాలని సూచించారు. 2015 జూన్ 1 నుంచి 2017 మే 31 మధ్య జన్మించిన బాలికలు ఈ ప్రవేశ పరీక్షకు అర్హులని పేర్కొన్నారు. మొత్తం 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారని, ఇందులో గణితం, ఆంగ్ల భాషా నైపుణ్యం, సాధారణ పరిజ్ఞానం, మానసిక సామర్థ్యానికి సంబంధించిన ప్రశ్నలు ఉంటాయని వివరించారు. ఆయా అంశాలపై పట్టు సాధించడంతో పాటు ప్రణాళికాబద్ధంగా సాధన చేస్తే పరీక్షను సమర్థంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని తెలిపారు. సైనిక్ స్కూల్‌లో ప్రవేశం పొందడం ద్వారా బాలికలు సైనిక విద్యా వాతావరణంలో చదువుకునే అవకాశాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. అర్హతలు, దరఖాస్తు విధానం, ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఇతర వివరాలను ముందుగానే తెలుసుకుని దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ పోటీ పరీక్షల సమాచార కేంద్రంలో ప్రవేశాల వివరాలు, పరీక్షా సన్నద్ధతపై సమాచారం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## అధ్యాపకులు లేకుండానే సెమిస్టర్లు.. ఎస్వీయూలో ఇదేం చదువులు?

**సోషల్ స్టడీస్ ఫ్యాకల్టీని వెంటనే నియమించాలి.. ఎస్ఎఫ్ఐ డిమాండ్**

**తిరుపతి విద్య, అక్టోబర్ 25 ప్రభాతవార్త**



అధ్యాపకులు లేకుండానే సెమిస్టర్లు పూర్తవుతున్నా, కొత్త విద్యా సంవత్సరం ప్రవేశాలు కొనసాగుతున్నా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలోని ఐఏఎస్ఈ కళాశాలలో సోషల్ స్టడీస్ అధ్యాపకుడి నియామకంపై నిరక్ష ్యం వీడటం లేదని ఎస్ఎఫ్ఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికే మూడో సెమిస్టర్ పూర్తయిందని, నాలుగో సెమిస్టర్ సమీపిస్తున్నా బోధనకు అవసరమైన అధ్యాపకుడిని నియమించకపోవడం విద్యార్థుల విద్యాభ్యాసాన్ని దెబ్బతీస్తోందని ఆ సంఘం ఉపాధ్యక్షుడు మహేష్‌బాబు విమర్శించారు. కళాశాలలో పనిచేసిన సోషల్ స్టడీస్ అధ్యాపకుడు పదవీ విరమణ చేసినప్పటి నుంచి ఆ స్థానంలో కొత్తవారిని నియమించలేదని తెలిపారు. ప్రత్యామ్నాయ బోధనా ఏర్పాట్లు చేయకుండా సెమిస్టర్లు పూర్తి చేయడం విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగో సెమిస్టర్ ప్రారంభమయ్యే సమయానికి కూడా అధ్యాపకుల కొరత తీరకపోతే విద్యార్థులు పాఠ్యాంశాలను ఎలా పూర్తిచేస్తారని ప్రశ్నించారు. మరోవైపు మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్న నేపథ్యంలో, వారికి బోధించేందుకు అవసరమైన అధ్యాపకుల నియామకంపై యాజమాన్యం దృష్టి సారించకపోవడం ఏమిటని నిలదీశారు. విద్యార్థులకు ప్రవేశాలు కల్పించి ఫీజులు వసూలు చేయడమే కాకుండా, వారికి నాణ్యమైన విద్యను అందించే బాధ్యతను కూడా కళాశాల నిర్వాహకులు గుర్తించాలని సూచించారు. అధ్యాపకుల కొరత విద్యార్థుల తప్పు కాదని, యాజమాన్య నిర్లక్ష్యానికి వారి విద్యా భవిష్యత్తు బలికాకూడదని స్పష్టం చేశారు. సోషల్ స్టడీస్ ఫ్యాకల్టీని తక్షణమే నియమించాలని, నాలుగో సెమిస్టర్ విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధన అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. మొదటి సంవత్సరం విద్యార్థులకు అవసరమైన అధ్యాపకులను ముందుగానే నియమించాలని, ఫ్యాకల్టీ కొరతను పరిష్కరించకుండా ప్రవేశాలు, ఫీజుల వసూళ్లకే ప్రాధాన్యం ఇస్తున్న తీరుపై విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు విచారణ జరపాలని కోరింది. విద్యార్థుల విద్యా హక్కులకు భంగం కలగకుండా అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని మహేష్‌బాబు డిమాండ్ చేశారు. యాజమాన్యం స్పందించకపోతే విద్యార్థుల పక్షాన ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఫీజుల వసూళ్లతో పాటు నాణ్యమైన విద్య అందించడానికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

## బలిజల ఐక్యతే రాజకీయ బలం!

ఎమ్మెల్యే ఆరణి



***తిరుపతి విద్య, అక్టోబర్ 25 ప్రభాతవార్త***

బలిజ సామాజికవర్గం రాజకీయంగా మరింత బలోపేతం కావాలంటే ఐక్యతతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కార్పొరేషన్ ఎన్నికల్లో సంఘటిత శక్తిని చాటుతూ ఎన్డీఏ కూటమి మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులకు అండగా నిలవాలని కోరారు. ఆదివారం స్థానిక కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన బలిజ అభ్యుదయ సేవా సంఘం ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి నగర రాజకీయాల్లో బలిజ సామాజికవర్గం ఐక్యత కీలకమని పేర్కొన్న ఆరణి శ్రీనివాసులు.. ఎన్నికలను సామాజికవర్గ రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంపొందించుకునే అవకాశంగా వినియోగించుకోవాలని సంఘం సభ్యులకు సూచించారు. టీడీపీ మేయర్ అభ్యర్థి జేబీ శ్రీనివాస్‌తో పాటు ఎన్నికల బరిలో ఉన్న 16 మంది కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో అభ్యర్థులను సంఘం ప్రతినిధులు సభ్యులకు పరిచయం చేశారు. బలిజల ఆత్మగౌరవ పరిరక్షణకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎన్డీఏ కూటమి మేయర్ అభ్యర్థి జేబీ శ్రీనివాస్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బలిజలు అవమానాలకు గురయ్యారని ఆయన ఆరోపించారు. నగరంలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలతో పాటు 22ఏ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బలిజ అభ్యుదయ సేవా సంఘం (బాస్) అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి ఊకా విజయ్‌కుమార్, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రేణిగుంట అగ్రిగోల్డ్ బాధితులకు శుభవార్త

### అక్టోబర్ 24 నుంచి బాండ్ల స్వీకరణకు అవకాశం

రేణిగుంట, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

అగ్రిగోల్డ్ బాధితులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త అందించింది. అగ్రిగోల్డ్ బాధితులకు బాండ్ల పంపిణీ ప్రక్రియను అక్టోబర్ 24 నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రక్రియలో భాగంగా తిరుపతి జిల్లాలోని రేణిగుంట మండలం బాధితులు తమకు సంబంధించిన అసలు బాండ్లతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. బాండ్ల స్వీకరణ ప్రక్రియ అక్టోబర్ 24, 26, 27 తేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం, సోమవారం, మంగళవారం రేణిగుంట మండలం అగ్రిగోల్డ్ బాధితులు వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ కార్యాలయం ప్రకటించింది. బాధితులు నిర్ణీత తేదీల్లో తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. బాధితులు తీసుకురావాల్సిన ధ్రువపత్రాలుబాండ్ల స్వీకరణ కోసం బాధితులు ఈ క్రింది పత్రాలను సిద్ధం చేసుకోవాలి.

1. అగ్రిగోల్డ్ అసలు బాండు. 2. అసలు బాండు స్వీయ ధ్రువీకరణతో కూడిన రంగు నకలు. 3. బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ నకలు. 4. ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు లేదా రేషన్ కార్డు. 5. పాన్ కార్డు నకలు. 6. నామినీ అయితే నామినీ గుర్తింపు కార్డు. 7. బాధితుడు మరణించి ఉంటే మరణ ధ్రువీకరణ పత్రం. 8. కుటుంబ సంబంధాన్ని నిర్ధారించే ధ్రువపత్రం. 9. అవసరమైన సందర్భాల్లో అధికార పత్రం లేదా అఫిడవిట్. 10. పాస్‌పోర్టు పరిమాణంలో ఉన్న ఫొటో. బాధితులు తమ వద్ద ఉన్న అసలు అగ్రిగోల్డ్ బాండ్లతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను తీసుకురావాలని సూచించారు. బాండ్ల స్వీకరణకు సంబంధించిన తేదీలు, ఇతర వివరాలను పరిశీలించుకుని నిర్ణీత సమయంలో కార్యాలయానికి చేరుకోవాలని కోరారు.